

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 353 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 19, నవంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# బీహార్‌లో.. బీభత్సం !



ఎన్నికల నిర్వహణపై ఎదురుదాడి

లక్షల ఓట్లు తొలగిస్తూ లక్షల ఓట్లు కలిపారు

హద్దు మీది లేకుండా పోతున్న ఎన్నికల నిర్వహణ

మహాధర్నాలో కోట్లాది మందికి పైగా పాల్గొన్న జనం

సమాధానం చెప్పలేక ముఖం చాటేసిన ఎన్నికల కమిషన్

దేశ ప్రజల హక్కులకు భంగం కలిగించడం ఎన్నికల కమిషన్‌కు తగునా?

దేశంలో పెరిగిపోతున్న కథానయ ఎన్‌కౌంటర్లలో మృతుల సంఖ్య

ప్రజాస్వామ్యం కోరిందేమిటి, ప్రభుత్వాలు చేస్తున్నదేమిటి

భారత ఎన్నికల నిర్వహణపై మండిపడుతున్న ప్రపంచ దేశాలు

ప్రతిపక్షాలను ఎక్కడికక్కడ అణిచివేస్తున్నారు

డాక్టర్ బరిగెల శివ






credit: istockphoto.com/Sadeugra



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్



రానురాను ఎన్నికల కమిషన్ రాజకీయంలో భాగస్వామిగా మారిపోతున్నట్లుగా జాతీయ ఎన్నికల కమిషన్ వ్యవహారశైలి కనిపిస్తుందని, దానిని దేశ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని డాక్టర్ బరిగెల శివ మండిపడ్డారు. గెలుపు కోసం సాంకేతిక పరికరాలను పుష్కలంగా వాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని చూసి ప్రపంచ దేశాలు మండిపడుతున్నా యన్నారు. అణచివేతలతో, అక్రమ కేసులతో అట్టడుగున పోతున్న బీహార్ రాష్ట్రాన్ని చూసి దేశ ప్రజల్లో ఎక్కడలేనంత కోపం సంతరించు కుంటోందన్నారు. అణచివేత మొదలైతే తిరుగుబాటు, ఎదురుదాడులు మొదలవుతాయని, ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితుల పరిణామాలు దేశ ప్రజలను కదిలిస్తున్నాయన్నారు.

- హైదరాబాద్ జై భీమ్ డెస్క్

2



## భారత్ ఆర్థిక శక్తి లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం అవుతుంది

### సీఎం రేవంత్ రెడ్డి

**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

దేశాన్ని 2047 నాటికి బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ కూడా కీలక పాత్ర పోషించే సంకల్పంతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూ కేంద్ర పాలిత ప్రాంతాల పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారత్ స్వాతంత్ర్య శతాబ్ది అయిన 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో తెలంగాణ తన వంతు బాధ్యతగా

- మిగతా 2లో..



## కోటి మంది మహిళలకు.. కోటి చీరలు

### అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర

### రేపు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం

### ఇందిరమ్మ చీరలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## బీహార్ ఓటమికి నాదే బాధ్యత - రాహుల్ గాంధీకి నేతల మద్దతు

వివరాలు 6లో

## రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ ఉచ్చులో చిక్కిన సర్వేయర్ కిరణ్

### సహచరుడు భాస్కర్‌తో పాటు అదుపులోకి

**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



హైదరాబాద్–సికింద్రాబాద్ ప్రాంతంలో లంచం వ్యవహారం బయటపడింది. ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ కిరణ్ రూ.1 లక్ష లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో అతనితో పాటు పనిచేస్తున్న సహచరుడు భాస్కర్ కూడా ఏసీబీ ఉచ్చులో చిక్కాడు. భూమి సంబంధిత పని పరిష్కారం కోసం లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు ఏసీబీని సంప్రదించగా, అధికారులు ముందస్తు మోహరించి, సూచించిన ప్రదేశంలో డబ్బులు స్వీకరిస్తున్న సమయంలో కిరణ్ మరియు భాస్కర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విధుల్లో ఉన్నత నైతిక విలువలు పాటించాల్సిన ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తుండటంపై ఏసీబీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి మరింత విచారణ కొనసాగిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది. పట్టుబడ్డ అధికారుల నుంచి మరిన్ని వివరాలను సేకరించి, చెందాల్సిన శాఖలకు నివేదికలు పంపనున్నారు. ఈ ఘటనతో ఎమ్మార్వో కార్యాలయంలో కలకలం, ఇతర ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కోటి మంది మహిళలకు కోటి చీరలు

**అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర**
**రేపు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం**
**ఇందిరమ్మ చీరలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సాంకేతికతను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్‌లూమ్స్ శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈఓ డి. దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# భవితశ్రీ చిట్‌ఫండ్ ఎండీ అరెస్ట్

**కోట్ల రూపాయల మోసం కేసులో పోలీసులు అదుపులోకి**

**హనుమకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



భవితశ్రీ చిట్‌ఫండ్ సంస్థ ఎండీ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు కేసుల్లో నిందితుడిగా ఉన్న శ్రీనివాస్ పరారీలో ఉండగా, హనుమకొండ పోలీసులు అతన్ని పట్టుకున్నారు. కోట్లాది రూపాయలు చిట్టీ సభ్యులకు ఎగనామం పెట్టి మోసం చేసిన కేసుల్లో శ్రీనివాస్‌పై బాధితులు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఈ ఫిర్యాదుల మేరకు పోలీసులు పలు కేసులు నమోదు చేశారు. తాజాగా అతన్ని అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ పరిగి నియోజకవర్గంలో నేతల పర్యటన

**వికారాబాద్ జిల్లా, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

రైతుల సమస్యల పట్ల పోరాడేది, వారికి అండగా నిలిచేది బిఆర్ఎస్ పార్టీయేనని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. పత్తి రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న వివక్షను నిరసిస్తూ ఆమెతో పాటు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నేడు పరిగి నియోజకవర్గంలో పర్యటించారు. పండించిన పంట కొనుగోలు రోజు వచ్చి ఎంతో కాలమైనా, రైతులకు నష్టపరిహారం అందకపోవడం దారుణమని వారు విమర్శించారు. అకాల వర్షాలు, అననుకూల వాతావరణ పరిస్థితుల వల్ల ఇప్పటికే భారీగా నష్టపోతున్న రైతులను ఆదుకునే ఆలోచన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు పండించిన పత్తిని తేమ శాతం సంబంధం లేకుండా, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. రైతులను అన్ని విధాలుగా కుదేలు చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపాఠం చెప్తారని వారు స్పష్టం చేశారు.



# బీహార్‌లో బీభత్సం !

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

రాను రాను ఎన్నికల కమిషన్ రాజకీయంలో భాగస్వామిగా మారిపోతున్నట్లు జాతీయ ఎన్నికల కమిషన్ వ్యవహారశైలి కనిపిస్తుందని, దానిని దేశ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని డాక్టర్ బరిగెల శివ మండిపడ్డారు. గెలుపు కోసం సాంకేతిక పరికరాలను పుష్కలంగా వాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని చూసి ప్రపంచ దేశాలు మండిపడుతున్నాయన్నారు. అణచివేతలతో, అక్రమ కేసులతో అట్టడుగున పోతున్న బీహార్ రాష్ట్రాన్ని చూసి దేశ ప్రజల్లో ఎక్కడలేనంత కోపం సంతరించుకుంటుందన్నారు. అణచివేత మొదలైతే తిరుగుబాటు, ఎదురుదాడులు మొదలవుతాయని, ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితుల పరిణామాలు దేశ ప్రజలను కదిలిస్తున్నాయన్నారు. బీహార్‌లో జరుగుతున్న మహాధర్నాలలో కోట్ల మంది జనం పాల్గొంటుండగా ప్రభుత్వానికి అనుకూలతలను ఎలా సమర్థించుకుంటారంటూ నిలదీశారు. నిజాయితీగా బీహార్‌లో ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు పడినట్లయితే కోట్ల మంది జనం ఎందుకు ఎదురుదాడి చేస్తారంటూ ప్రశ్నించారు. ప్రచండ కోపగ్రస్తులవుతున్న బీహార్ ప్రజలను చూసి దేశ ప్రజలు ఎంతో నేర్చుకోవాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం ఉక్కు పిడికిలి బిగించి రోడ్లపైకి ఎక్కి ధర్నాలు నిర్వహిస్తున్న బీహార్ జనం ఇసుక గెస్తే రాలనంత జనం ర్యాలీలలో కదం తొక్కడం దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకోవాలనే కనువిప్పు కలిగిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంతో పని లేకుండానే ఎన్నికల్లో గెలవడమే ముఖ్యమని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్న తీరు పట్ల దేశంలో ఒక్కసారిగా వ్యతిరేకత సంతరించుకుందన్నారు. భారత రాజ్యాంగంతో పని లేకుండా ప్రజల్ని ఎలా బోల్తా కొట్టించి గెలువగలమో ప్రస్తుత బీహార్ ఎన్నికల్లో జరిగిన విధానం చూస్తే ఎన్నికల రాజ్యాధికారం ఎవరి కోసం నిర్వహిస్తున్నారో అనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు. ప్రజలు తిరగబడినప్పుడు, ప్రజాస్వామ్యవాదులు ధర్నాలకు దిగినప్పుడు దేశ ప్రజల హక్కుల కంటే ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడమే ముఖ్యమనుకునే రీతిలో దేశంలో ఎన్నికలు జరుగుతుండడం అత్యంత ప్రమాదకరమన్నారు. బీహార్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థుల ఈవీఎం మిషన్ ఓట్ల లెక్కింపునకు పడిన బ్యాలెట్ ఓట్ల లెక్కింపును జతపరచి విచారణతో కూడిన ఓట్ల లెక్కింపు తిరిగి జరపాలని దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు డిమాండ్ చేస్తున్నారన్నారు. మోసం చేసి గెలవడం కూడా రాజకీయంలో రాజరికంలా భావిస్తే ఎలా అన్నారు. దేశంలో ఎన్నికలు జరుగుతున్నాయా అక్రమాలు జరుగుతున్నాయా ప్రజలకు అంతు చిక్కడం లేదన్నారు. సహజంగా, సజావుగా ఎన్నికలు జరిగాయని ప్రభుత్వాలు భావిస్తే కోట్ల మంది జనం ధర్నాకు ఎందుకు దిగుతారంటూ నిలదీశారు. గెలుపును ఆస్వాదిస్తూ సంతోషం వ్యక్తం చేయాల్సిన జనం కోట్ల సంఖ్యలో ఎదురు తిరగడం వెనకాల ఎన్నికల నిర్వహణ కుట్రలు పక్కాగా ఉన్నాయని బీహార్ ప్రజలు నిర్వహిస్తున్న ధర్నాలు తెలియజేస్తున్నాయన్నారు. పేరుకు తెగ నిజాయితీ మాటలు పలుకుతూ చేతల్లో మాత్రం సర్వం మోసాలకు పాల్పడుతుండడం రాజకీయ నాయకులు గొప్పతనంగా ఫీల్ అవుతున్నారని తీవ్రంగా విమర్శించారు. చేసేదేమీ లేక చేతులెత్తేసిన ఎన్నికల కమిషన్ తీరును దేశ ప్రజలు పూర్తిస్థాయిలో తప్పుబడుతున్నారన్నారు. బీహార్ ఎన్నికలు జరగడానికి ముందు ఎన్నికల కమిషన్ విడుదల చేసిన చివరి ఓటర్ లిస్ట్ జాబితాలలో సర్వ మోసాలు వెలుగులోనికి వస్తున్నాయన్నారు. సర్వం తప్పిదాలను కూడా ఏమాత్రం జంకకుండా ప్రజాక్షేత్రంలో పొందుపరచడం చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం కావాలనే ప్రజలను నాశనం చేస్తున్నట్లుగా ఉందన్నారు. భరించరాని ఒత్తిడితో దేశ ప్రజల మనోభావాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, వాటన్నిటికీ కేంద్ర ప్రభుత్వం, జాతీయ ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ప్రయోగిస్తున్న అస్త్రాలు మతాల పేరున ప్రజలను రెచ్చగొట్టడం, మతవిద్వేషాలను రేపుతూ మత కోలాహలాల మధ్యలో ఎన్నికలు నిర్వహించుకోవాలని చూడడం తీవ్రమైన మోసమన్నారు. బస్సులు పేల్చబడడం, రైళ్లు బోల్తాపడడం, బాంబు బ్లాస్టులు, కార్ల బ్లాస్టులు ప్రధాన నగరాలలో తెలియకుండానే జరిగిపోతుండడం ఎన్నికల స్టంట్లలో భాగమైపోతున్నాయన్నారు. పేరు పెద్దరికానికే ప్రభుత్వ పెద్దలుగా చలామణవుతూ లోలోపల దేశం పట్ల, దేశ ప్రజల పట్ల ఎంతటి క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారో నేడు బీహార్‌లో జరుగుతున్న భీభత్సాన్ని చూస్తుంటే స్పష్టంగా తేలిపోతుందన్నారు. సోషల్ మీడియా వేదికగా, ట్విట్టర్ వేదికగా, వాట్సాప్, ఇన్‌స్టా వేదికలుగా దేశంలో ఎక్కడ చూసినా బీహార్ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై విస్తృతమైన ప్రచారం సాగుతుందని, వాటన్నిటిని దేశ ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారన్నారు. సోషల్ మీడియా అనే ఆయుధం ప్రపంచాన్ని సైతం భారతదేశం వైపు చూసేలా చేస్తుందని, దేశంలో జరుగుతున్న ఎన్నికల నియమావళిపై ప్రపంచ దేశాలు ఒక్కసారిగా విమర్శలు గుప్పిస్తుండడం, వాటన్నిటిని కేంద్ర ప్రభుత్వం చాలా లైట్‌గా తీసుకుంటుండడం గమనిస్తుంటే ఎన్నికల కమిషన్ ఆగడాలకు హద్దు లేకుండా పోతుందని, కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలే దానికి కారణమని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాను రాను ఇలాంటి అక్రమాలన్నీ వెలుగులోనికి వస్తే జాతీయ ఎన్నికల కమిషనర్ పరిస్థితి ఏమిటనేది గుర్తుచేశారు. ఇప్పటి మట్టుకు ఎలాగోలా గెలిచి బయటపడితే సరిపోతుందనుకుంటే ప్రస్తుతం జరుగుతున్న అక్రమాలు అన్నిటిని కాలం గుర్తించాల్సిన సమయం వస్తే వాటిని తట్టుకోగల శక్తి ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులకు ఉంటుందా అంటూ నిలదీశారు. ఎన్నికల కమిషన్ అంటేనే ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి లోబడి ప్రజల హక్కులకు అనుగుణంగా పనిచేయాలి గాని కేవలం కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిపోయి ఏం చేసినా ఎలా చేసినా అడిగేవాడు ఉండకూడదు, మాట్లాడేవాడు ఉండకూడదు, ప్రశ్నించేవాడు ఉండకూడదు, తిరుగుబాటు చేసేవాళ్లు ఉండకూడదు అనుకునే స్వయంకృతాపరాధాన్ని ఇకనైనా మానాలని, లేదంటే దేశంలో జరగబోయే పరిణామాలకు పక్కాగా జాతీయ ఎన్నికల కమిషన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తుచేశారు. బీహార్ ప్రభుత్వమైనా, కేంద్ర ప్రభుత్వమైనా, కేంద్ర ప్రభుత్వంలో పాలిభాగస్వాములైన కేంద్రమంత్రులైనా, జాతీయ ఎన్నికల కమిషన్ అధికారులైనా బీహార్ ప్రజలు నిర్వహిస్తున్న ధర్నాలపై ఆధారాలతో కూడిన సమాధానాలను ఇవ్వండి అంటూ సూటిగా నిలదీశారు. తప్పులు చేయలేదని బలంగా విశ్వసిస్తున్నప్పుడు ప్రజలకు సమాధానం చెప్పడానికి ఎందుకు జంకుతున్నారు అంటూ నిలదీశారు.

# భారత్ ఆర్థిక శక్తి లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం అవుతుంది

మొదటి పేజీ తరువాయి

ముందుకు సాగుతోందని, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రాజెక్టులకు కేంద్రం సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ అభివృద్ధిలో పట్టణీకరణ, ముఖ్యంగా మెట్రోపాలిటన్ నగరాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, హైదరాబాద్ అభివృద్ధి కోసం రాష్ట్రం చేపట్టిన పలు మెగా ప్రాజెక్టులను కేంద్రం వెంటనే ఆమోదించాలని కోరారు. వాటిలో హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, గోదావరి నీటి తరలింపు, డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రవేశపెట్టడం, ట్రాఫిక్, కాలుష్య నియంత్రణ, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి ప్రాజెక్టులు ముఖ్యమైనవని వివరించారు. హైదరాబాద్ మిశ్రమ సంస్కృతి, అనుకూల వాతావరణం, ఉత్తమ మౌలిక సదుపాయాలతో దేశ ఐటీ, ఫార్మా, డేటా సెంటర్లకు కేంద్రబిందువుగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. అదే నేపథ్యంలో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం ప్రారంభించి, హైదరాబాద్‌ను న్యూయార్క్, సింగపూర్, దుబాయ్‌లతో పోటీ పడే నగరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందడానికి కేంద్రం సహకారం అత్యవసరమని, రాజకీయాలు పక్కన పెట్టి దేశం, రాష్ట్రాల ప్రగతికి కలిసి పని చేయాల్సిన సమయం ఇదని సీఎం స్పష్టం చేశారు. సీఎం విజ్ఞప్తులపై స్పందించిన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు త్వరలోనే కేంద్రం అనుమతులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు.

# హైదరాబాద్‌లో మరోమారు ఐటి దాడులు

**పాస్తాహౌజ్, షాగ్ హౌజ్, మెహిఫిల్ హోటల్ లో అక్రమాలు**
**ప్రముఖ హోటల్ యజమానుల ఇళ్లల్లో సోదాలు**

**హైదరాబాద్,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

నగరంలో మరోసారి ఐటీ దాడులు కలకలం రేపింది. ప్రముఖ హోటళ్ల చైర్మన్‌లు, డైరెక్టర్ ఇళ్లలో సోదాలు చేపట్టారు. హైద్రాబాద్ కేంద్రంగా నడుస్తున్న హోటల్స్ బిజినెస్‌పై ఐటీ సోదాలు నిర్వహించారు. మొత్తం 30 చోట్ల ఏకకాలంలో ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగ్ హౌస్, మేహిఫెల్ హోటల్లో యజమానుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. పిస్తా హౌస్, షాగౌస్ , మేహిఫెల్ హోటల్స్ ప్రతి ఏటా వందల కోట్లు వ్యాపారం చేస్తున్నాయి. ఈ హోటల్స్ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. రాజేంద్రనగర్‌లోని పిస్తా హౌస్ ఓనర్ మహమ్మద్ మజీద్, మహమ్మద్ ముస్తాన్ ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు చేసారు. ఈ క్రమంలో రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదాయం మధ్య వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హవాలా, నకిలీ లావాదేవులు, అనుమానాస్పద ట్రాన్సాక్షన్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్యాక్స్ చెల్లింపులో వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. పిస్తా హౌస్ ఓనర్ మజీద్ నివాసంలో ఆరు బృందాలు సోదాలు జరుపుతున్నాయి. పిస్తా హౌస్‌లో పనిచేసే వర్కర్ల ఇళ్లల్లోనూ, వర్కర్లకు కల్పించిన వసతి నివాసాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. వారికి సంబంధించిన ఫోన్లు, కంప్యూటర్లను ఐటీ అధికారులు చెక్ చేశారు. ఫోన్లలో, కంప్యూటర్లో ఉన్న డేటాను ఐటీ శాఖకు సంబంధించిన హ్యాకర్లు విశ్లేషిస్తున్నారు. అయితే పిస్తా హౌస్ అకౌంటెంట్ మాత్రం అందుబాటులోకి రాని పరిస్థితి. బినామీల పేర్లతో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో వర్కర్ల ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్ కి సంబంధించిన హార్డ్ డిస్కులు, కీలక పత్రాన్ని సీజ్ చేశారు. అంతే కాకుండా వర్కర్ల నుంచి ఐటీ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు సమాచారం. కాగా.. సుమారు 600 మంది పైగా ఐటీ అధికారులు 30 బృందాలుగా ఏర్పడి నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**మారేడుమిల్లి,నవంబర్18(జై భీమ్ న్యూస్):**

మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

# వృద్ధ దంపతులతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ఆత్మీయ పలకరింపు

**మెగా హెల్త్ క్యాంపులో హృదయాన్ని తాకిన దృశ్యం**

**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిన్న జరిగిన మెగా హెల్త్ క్యాంపులో సేవల కోసం వచ్చిన వృద్ధ దంపతుల అనుబంధం, అన్యోన్యత చూసి కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి హృదయపూర్వకంగా స్పందించారు. అధికార హోదా, బిజీ షెడ్యూల్ అన్నది పక్కనపెట్టి, పూర్తిగా మానవత్వంతో ఆ జంట వద్దకు వెళ్లి పలకరించడం అక్కడికి వచ్చిన వారికి వినూత్నంగా అనిపించింది. వైద్య పరీక్షల కోసం క్యూలో నిల్చున్న ఆ దంపతులను చూసి ఏసీపీ స్వయంగా దగ్గరికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దంపతుల మధ్య ఉన్న ప్రేమాభిమానాలు, పరస్పర శ్రద్ధ చూసి ఏసీపీ ప్రశాంత్ రెడ్డి చిరునవ్వుతో "మీది ప్రేమ వివాహమా?" అని సరదాగా అడగడంతో అక్కడి వాతావరణం మరింత హర్షోల్లాసంగా మారింది. తరువాత వారి కుటుంబ పరిస్థితులు, వయసు, జీవనోపాధి వంటి వివరాలను శ్రద్ధగా తెలుసుకున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి వెంటనే వారికి



కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ చర్య అక్కడ ఉన్న ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. అధికార హోదా ఉన్నా ప్రజలతో మమకారం, సేవా భావం ఎలా ఉండాలో ఏసీపీ ప్రవర్తన మరోసారి చూపించింది. ఆత్మీయంగా మాట్లాడి, సాయం అందించిన ఈ



దృశ్యాలు క్యాంపుకు వచ్చిన వారిని ఆకట్టుకోవడంతో పాటు, ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంచేలా నిలిచాయి. ఎల్లప్పుడూ ప్రజల సేవలో ముందుండే ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మానవత్వం మరోసారి వెలుగులోకి వచ్చింది.

## నిరుపయోగంలో ఉన్న సామగ్రిని వినియోగంలోకి తీసుకువచ్చి ఆదర్శంగా నిలిచిన గణితశాస్త్ర విభాగం

**అభినందించిన కేయూ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి**





**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధి కార్యక్రమాల పరంపరలో భాగంగా గణితశాస్త్ర విభాగం చేపట్టిన నిరుపయోగం నుంచి ఉపయోగం కార్యక్రమం విశ్వవిద్యాలయంలో ఆదర్శంగా నిలిచింది. ఏళ్లుగా విశ్వవిద్యాలయంలోని వివిధ ప్రాంతాల్లో నిరుపయోగంగా పేరుకుపోయి ఉన్న పాత రేకులు, స్టీల్ రాడ్లు, చెక్క సామగ్రి, ఇనుప టేబుళ్లు, టైల్స్, పోలిష్ రాళ్లు మరియు ఇతర నిర్మాణ సామగ్రిని సేకరించి వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడంలో విభాగం ముందడుగు వేసింది. విభాగ ఉపాధ్యాయులు, సిబ్బంది స్వచ్ఛంద ఆర్థిక సహకారంతో సేకరించిన సామగ్రిని ఉపయోగించి విభాగంలో విద్యార్థులకు అనువుగా అనేక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. వాహనాల పార్కింగ్ స్టాండ్, షటిల్ కోర్ట్, అలాగే పరిశోధకులు %-% విద్యార్థుల చిన్న సమావేశాల కోసం ఓ చిన్న భోజనశాల (లంచ్ హాల్) నిర్మించబడింది. ఈ నిర్మాణాలు విభాగ కార్యకలాపాల నిర్వహణలో సౌలభ్యం పెంచడంతో పాటు, విభాగ ఆవరణ సుందరీకరణకూ తోడ్పడినట్టు విభాగాధిపతి డాక్టర్ ఆర్. భారవి శర్మ తెలిపారు. ఈ నిర్మాణాలకు కావాల్సిన చిన్నపాటి వ్యయాలను విభాగ బోధనా సిబ్బంది స్వచ్ఛంద విరాళాల రూపంలో ?90,000 రూపాయలు సమకూర్చినట్టు, అలాగే సామగ్రి సమీకరణ నిర్మాణంలో హాస్టల్ సిబ్బంది శోభన్, ఇతరులు ప్రత్యేకంగా సహకరించినట్టు డాక్టర్ శర్మ పేర్కొన్నారు. గణితశాస్త్ర విభాగం చేసిన ఈ సృజనాత్మక వినియోగాన్ని ప్రశంసించిన వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, పాత వనరులను వినియోగంలోకి తీసుకువచ్చే ఈ ప్రయత్నం విశ్వవిద్యాలయానికి ఆదర్శం. ఇతర విభాగాలు కూడా ఇలాంటి సంస్కరణాత్మక కార్యక్రమాలను చేపట్టాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య పి. మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ సోమయ్య, ఆచార్య వెంకటరామరెడ్డి, ఆచార్య వై. వెంకయ్య, బోధనా.. బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో యువజనోత్సవాల శుభారంభం

**ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య**





**భూపాలపల్లి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

భూపాలపల్లి జిల్లా మంజూరునగర్ ఇల్లంద క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరైన ఆమె, ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, యువజనోత్సవాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నాయకత్వ గుణాలను వెలికితీసే వేదికగానూ, అభివృద్ధికి పునాది లాంటివని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. వివిధ పోటీల్లో పాల్గొని జిల్లా ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా యువత ముందుకు రావాలన్నారు. జాతీయ యువజనోత్సవం సందర్భంగా యువత తమ ప్రతిభను నిరూపించుకొని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షిస్తూ, స్వామి వివేకానంద ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువతులు ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన పెంపు కోసం ఎంపీ కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా యువజన మరియు క్రీడా అధికారి సిహెచ్. రఘు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు

**దత్తత నిబంధనలు సరళీకరించాలని సుప్రీం సూచన**

**న్యూఢిల్లీ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

ఇటీవల పలు రాష్ట్రాల్లో చిన్నారుల మిస్సింగ్ పై మీడియాలో వార్తలు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిన్నారుల మిస్సింగ్‌పై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఎనిమిది నిమిషాలకొక చిన్నారి మిస్ అవుతున్నారనే వార్తలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తెలిపారు. ఈ క్రమంలో దత్తత నిబంధనలు సరళీకృతం చేయాలని సూచించారు. పిల్లల దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండటం వల్ల అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు నాగరత్న. చిన్నారుల మిస్సింగ్ అంశంపై జిల్లాకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని గత విచారణలో సూచించింది సుప్రీంకోర్టు. తెలంగాణలో అక్రమ దత్తత వ్యవహారంలో పలు కేసులు బయటకు వచ్చాయని న్యాయవాది గుర్తుచేశారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.

## కొడకండ్ల మండలంలో వడ్ల కొనుగోలు కేంద్ర పరిశీలన

**ప్రభుత్వంపై భగ్గుమన్న ఎర్రబెల్లి**



**కొడకండ్ల, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున??్షరని, ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేసినది కేవలం ఐదు నుండి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమేనని తెలిపారు. కొనుగోలు చేస్తామని ప్రకటించిన 85 లక్షల టన్నులతో పోలిస్తే ఇది చాలా తక్కువేనని మండిపడ్డారు. కొనుగోలు చేసిన వడ్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీసిందని విమర్శించారు. సుమారు ?1,200 కోట్ల ఎంఎస్పీ, దాదాపు ?200 కోట్ల బోనస్ ఇప్పటికీ రైతులకు అందలేదని వివరించారు. 24 గంటల్లో బోనస్ ఇస్తామని చెప్పిన వారు, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గత యాసంగి బోనస్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని ఎర్రబెల్లి ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించి, వెంటనే బకాయిలన్నీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## కొడకండ్ల మండలంలో వడ్ల కొనుగోలు కేంద్ర పరిశీలన

**ప్రభుత్వంపై భగ్గుమన్న ఎర్రబెల్లి**

**కొడకండ్ల, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేసినది కేవలం ఐదు నుండి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమేనని తెలిపారు. కొనుగోలు చేస్తామని ప్రకటించిన 85 లక్షల టన్నులతో పోలిస్తే ఇది చాలా తక్కువేనని మండిపడ్డారు. కొనుగోలు చేసిన వడ్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో ఉండటం రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీసిందని విమర్శించారు. సుమారు ?1,200 కోట్ల ఎంఎస్పీ, దాదాపు ?200 కోట్ల బోనస్ ఇప్పటికీ రైతులకు అందలేదని వివరించారు. 24 గంటల్లో బోనస్ ఇస్తామని చెప్పిన వారు, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. గత యాసంగి బోనస్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని ఎర్రబెల్లి ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించి, వెంటనే బకాయిలన్నీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



## వరంగల్ జిల్లాకు జల సంచయ్ జన్ భాగీదారి అవార్డు

**జాతీయ స్థాయిలో మెరిసిన వరంగల్ ఖ్యాతి**



**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

వరంగల్ జిల్లా మరోసారి జాతీయ వేదికపై ప్రతిష్ఠను చాటుకుంది. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి నిర్వహించిన "జల సంచయ్%-%జన్ భాగీదారి 1.0" అవార్డుల్లో, దక్షిణ భారతదేశం జల సంరక్షణ కేటగిరీ%-%2లో వరంగల్ జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. మంగళవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా అవార్డు లభించడంపై కలెక్టర్ డా. సత్య శారద సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయానికి అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన సహకారమే కారణమని పేర్కొన్నారు. జిల్లాలో నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా 42,342 ఇంకుడు గుంటలు, 8,013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టి కట్టలు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు, కాంటూరు కందకాలు, రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, బోరు బావుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ కాలువలు, రైతుల భూముల్లో డ్రిప్ ఇరిగేషన్, అటవీ ప్రాంతాల్లో కందకాలు, చిన్న ఊట కుంటలు వంటి విస్తృత నీటి సంరక్షణ కార్యకలాపాల వలన జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి, ఈ అవార్డు రూపంలో కేంద్రం నుంచి రూ. 1 కోటి నగదు ప్రోత్సాహకంగా లభించింది. అవార్డు సాధనకు కృషి చేసిన అధికారులకు, సహకరించిన ప్రజలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రామిరెడ్డి పాల్గొన్నారు. జిల్లాకు ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# డ్రగ్స్, ర్యాగింగ్ మహమ్మారుల జోలికి పోవద్దు






**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ క్రైమ్ న్యూస్):**

మత్తు పదార్థాలు, ర్యాగింగ్ యువత భవిష్యత్తును చెడగొట్టే మహమ్మారిలా మారాయని, వీటి జోలికి ఎట్టి పరిస్థితుల్లోనూ పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. వరంగల్ మెడికల్ కళాశాలలోకి కొత్తగా చేరిన ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ మాట్లాడుతూ, దేశమంతా నుండి వరంగల్ నగరానికి వచ్చిన వైద్య విద్యార్థులకు ఇది శ్రేష్ఠమైన విద్యా కేంద్రమని పేర్కొన్నారు. ర్యాగింగ్‌పై విద్యార్థులను అప్రమత్తం చేస్తూ, జూనియర్ల%-%సీనియర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొనాలని, ర్యాగింగ్‌కు పాల్పడితే ఆరు నెలల నుండి జీవితకాలం వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ర్యాగింగ్ కేసులు భవిష్యత్తు మీద తీవ్ర ప్రభావం చూపుతాయని గుర్తు చేశారు. మత్తు పదార్థాల వినియోగం యువత జీవితాలను అంధకారంలోకి నెడుతుందని, ఆరోగ్యపరంగా %-% ఆర్థికపరంగా నష్టాల్లోకి దిగజార్చుతుందని, ముఖ్యంగా తల్లిదండ్రుల ఆశలను దెబ్బతీస్తుందని సీపీ తెలిపారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయం ఎక్కడైనా గమనించిన వెంటనే కళాశాల యాజమాన్యానికి, స్థానిక పోలీసులకు లేదా నార్కోటిక్స్ విభాగం 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. సైబర్ నేరాల ప్రమాదాలపై కూడా సీపీ విద్యార్థులను అప్రమత్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే సందేశాలు, లింకులు, ఈమెయిల్స్‌కు స్పందించవద్దని, అనుమానాస్పద వెబ్‌సైట్లలో వ్యక్తిగత సమాచారం అప్‌లోడ్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు లేదా పెట్టుబడులు పెట్టడం ప్రమాదకరమని హెచ్చరించారు. తరువాత విద్యార్థుల చేత యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించి, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వరంగల్ ఏఎస్పీ శుభం నాగ్, డీఎస్పీలు రమేష్, గిరికుమార్, కెఎంసీ ప్రిన్సిపాల్ డా. సంధ్యారాణి, ఎంజిఎం సూపరింటెండెంట్ డా. హరిచంద్ర రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వకపోతే కాంగ్రెస్‌కు గట్టి హెచ్చరిక

**టిఆర్‌పి యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్**



**మహబూబాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు - రాజులకొత్తపల్లి ప్రాంతాల్లో టిఆర్‌పి రాష్ట్ర యువ నాయకుడు వరిపల్లి అనిల్ కుమార్ బీసీ రిజర్వేషన్లపై తీవ్ర స్థాయిలో స్పందించారు. బీసీ సమాజానికి చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేయకపోతే రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి బుద్ధి చెప్పేలా బీసీ ఓటర్లు ఏకమవుతున్నారని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో 52శాతం పైగా జనాభా ఉన్న బీసీ సమాజం దశాబ్దాలుగా విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో న్యాయమైన వాటా కోసం పోరాటం చేస్తూనే ఉందని గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ వారి జనాభాకు తగిన రిజర్వేషన్లు అమల్లో లేకపోవడం తీవ్ర అన్యాయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి హామీ చేసినట్లుగా బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను చట్టబద్ధం చేయడం తప్పనిసరి. ఇది రాజకీయ డిమాండ్ కాదు బీసీ సమాజం యొక్క హక్కు. ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన నిర్ణయం లేదని ప్రజల్లో నిరాశ నెలకొంది. రిజర్వేషన్‌పై స్పష్టమైన హామీ రాకపోతే స్థానిక ఎన్నికల్లో బీసీ సమాజం కాంగ్రెస్‌ను ఓడించడానికి పూర్తిగా సిద్ధంగా ఉంది” అని వరిపల్లి అనిల్ కుమార్ హుషారుగా పేర్కొన్నారు. అలాగే బీసీల హక్కులను హరించే ఏ పార్టీ అయినా ఇక బీసీ యువత నిశ్శబ్దంగా ఉండబోదని హితవు పలికారు. రాష్ట్రంలోని ప్రతీ మండలం, గ్రామం వరకు బీసీ హక్కుల ఉద్యమాన్ని విస్తరించే చర్యలు చేపడుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## వానరసేన రాజమౌళిపై పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్):**

ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిపై వివాదాస్పద వ్యాఖ్యల ఆరోపణలతో రాష్ట్రీయ వానరసేన సరూర్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో రాజమౌళి హనుమంతుడిపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని తన సినిమా కోసం ఉచిత ప్రచారం పొందడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వానరసేన ఆరోపించింది. హిందూ దేవుళ్ల పేర్లు ఉపయోగించి సినీ ప్రముఖులు కోట్లాదాయాలు సంపాదిస్తూనే, ప్రజా వేదికలపై మతాల మధ్య విభేదాలు రేకెత్తించేలా ప్రవర్తించడం తీవ్ర ఆందోళనకరం అని వానరసేన మండిపడింది. ఇలాంటి వ్యాఖ్యలు లక్ష్యపూర్వకంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించే ప్రమాదం ఉందని సంస్థ నాయకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు రాజమౌళిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వానరసేన రాష్ట్ర అధ్యక్షుడు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సమర్పించారు. తమ ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా వానరసేన ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి దేవాలయ భూమి కబ్జా ప్రయత్నాలపై బీజేపీ ఆగ్రహం




**హసన్‌పర్తి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

హసన్‌పర్తి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ఎర్రగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ భూములపై జరుగుతున్న అక్రమాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా దేవాలయ భూమిలో అక్రమ తవ్వకాలు, కబ్జా ప్రయత్నాలు, నిర్మాణాలను ప్రారంభించి మళ్లీ ఆపడం వంటి చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. కొంతమంది దళారులు దేవాలయ పరిసరాల్లోని జాతర స్థలాలను తమ పూర్వీకుల భూములంటూ చూపుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడం విచారకరమని గురుమూర్తి శివకుమార్ విమర్శించారు. ఇకనైనా అధికారులు వెంటనే అక్రమ కార్యకలాపాలను నిలిపివేసి దేవాలయ భూమిని శాశ్వతంగా రక్షించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించిన ఆయన, అవసరమైతే స్వయంగా సీపీ, కలెక్టర్, దేవాదాయ శాఖ మంత్రిని కలసి వివరాలు సమర్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు మారం తిరుపతి, రైల్వే బోర్డు సభ్యులు దాసరి రాజు, తాళ్ల శ్యామ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు జీల సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కోయడ రాజు, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వరరావు, దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, పబ్బు ఉమా, మట్టెడ సుమన్, ఇమ్మడి కరుణాకర్, రామ్ శెట్టి అశోక్, తిప్పన్న, మోడెం రమేష్, కుంబర్కర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## క్రమంగా తగ్గుతున్న బంగారం ధరలు

హైదరాబాద్,నవంబర్18(జై భీమ్ న్యూస్): దేశీయంగా పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలుతగ్గుముఖం పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ.1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ.1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ.1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ.5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ.1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ.15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మహిళా జర్నలిస్టులపై ఆన్‌లైన్ బెదిరింపులపై కఠిన చర్యలు

**సీపీ సజ్జనార్ హామీ**



**హైదరాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

మహిళా జర్నలిస్టులపై సోషల్ మీడియాలో జరుగుతున్న నిరంతర ట్రోలింగ్, దూషణలు, బెదిరింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ హామీ ఇచ్చారు. స్వతంత్ర జర్నలిస్టు తులసి చందు సహా పలువురు మహిళా జర్నలిస్టులు మంగళవారం కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు సమర్పించారు. జర్నలిస్టుల ప్రతినిధి బృందం తమపై వస్తున్న అసభ్య పోస్టులు, విద్వేష వ్యాఖ్యలు, బెదిరింపుల వివరాలను చూపించే అనేక వీడియోలను కమిషనర్‌కు చూపించింది. పలు సోషల్ మీడియా అకౌంట్లు సమన్వయపూర్వకంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తూ, భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు వారు వివరించారు. కమిషనర్ సజ్జనార్ అందుబాటులో ఉన్న లింకులు, స్క్రీన్‌షాట్లు, వీడియోలను అధికారికంగా అందించాలని కోరారు. చర్యలు తప్పక తీసుకుంటాం. త్వరలో మీరు ఫలితాలు చూస్తారు, అని ఆయన జర్నలిస్టులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఫిర్యాదులో జర్నలిస్టులు తమపై క్రమబద్ధమైన ఆన్‌లైన్ వేధింపుల ధోరణి కొనసాగుతోందని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు, హ్యాండిల్లు ఉద్దేశపూర్వకంగా అసభ్య వ్యాఖ్యలు, ప్రాణహానికర బెదిరింపులు, అవహేళనలు, మతపరంగా ఉద్రిక్తత రేపే పోస్టులు చేస్తున్నారని తెలిపారు. తమ నివాస చిరునామాలు కూడా తెలుసునని కొందరు బహిరంగంగా చెప్పడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వేధింపుల లక్ష్యం తమ వృత్తిపరమైన పనిని అడ్డుకోవడమేనని జర్నలిస్టులు స్పష్టం చేశారు. సంబంధిత వ్యక్తులపై ఐపీసీ, ఐటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమర్పించిన ఫిర్యాదులపై వివరణాత్మకంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రకటించారు.

## లోన్ యాప్ వేధింపులతో.. యువకుడికి ప్రాణాపాయం

**హైద్రాబాద్, జై భీమ్ న్యూస్**



హనుమకొండ టీపీ టవర్ కాలనీకి చెందిన నవీన్ అనే యువకుడు లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన కలకలం రేపుతోంది. తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్ ద్వారా తీసుకున్న లోన్‌ను కుటుంబ సభ్యులకు తెలియనీయకుండా ఒత్తిడి తెచ్చేందుకు, యాప్ నిర్వాహకులు అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పోస్టు చేస్తూ నిరంతరం వేధింపులకు పాల్పడ్డారని యువకుడు వెల్లడించాడు. అధిక ఒత్తిడి, మానసిక వేధింపులు తాళలేక నవీన్ వడ్డెపల్లి%-%దేవన్నపేట మధ్యలోని బావిలో దూకి ప్రాణాపాయ స్థితిలో నుంచి బయటపడటానికి ప్రయత్నించాడు. స్థానికులు గమనించి వెంటనే బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు నవీన్‌ను ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు.

## ఎర్ర రాజశేఖర్ కులదురహంకార హత్యపై కేవీపీఎస్ ఆగ్రహం



**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

రంగారెడ్డి జిల్లా ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర రాజశేఖర్ హత్య ఘటనపై కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు తీవ్రంగా స్పందించారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజశేఖర్‌ను అర్ధరాత్రి కిడ్నాప్ చేసి, హత్య చేసి, శవాన్ని దహనం చేసిన అమానుష ఘటన వెనుక ప్రభుత్వ వైఫల్యం, పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నెలరోజుల క్రితమే విషయం పోలీసులకు తెలిసినా, బాధిత కుటుంబాన్నే టార్గెట్ చేసి వేధించడం, యువతీ కుటుంబం నుంచి వచ్చే బెదిరింపులను పట్టించుకోకపోవడం హత్యకు నేరుగా దారి తీసిందని ఆయన ఆరోపించారు. అభ్యంతరపు వివాహం కుదరవచ్చనన్న కారణంతోనే కుల దురహంకారంతో ఈ హత్య జరిగిందని స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో కులదురహంకార హత్యలు పెరుగుతున్నాయని, ఇప్పటివరకు 142 కేసులు నమోదు అయినా ముఖ్యమంత్రి సహా ఎవరూ స్పందించకపోవడం విచారకరమన్నారు. కులాంతర వివాహితల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవడం అత్యవసరమని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై కేవీపీఎస్ డిమాండ్లు: రాజశేఖర్ కుటుంబానికి పోలీసు రక్షణ, రూ. 50 లక్షల పరిహారం, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, నిందితులకు కఠిన శిక్షలు, కులాంతర వివాహ రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లను ముట్టడించడానికి వెనుకాడమని స్కైలాబ్ బాబు హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దూడపాక రాజేందర్, ముడుసు నారాయణ, సిరిమిల్ల సుభద్ర, ఇస్లావత్ రవీందర్, ఐత మారుతి, రేణుకుట్ల చందర్, ఆర్షం రాంకీ, ఎనగందుల బాబురావు, దాసరి నరేష్, కోడెపాక సదానందం, శనిగరం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ఏఐ’పై సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు

కృత్రిమ మేధ (ఏఐ) అంశంపై గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ బుడగ పగిలితే ప్రతి కంపెనీపై ఆ ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇదో అసాధారణ సందర్భమని, ప్రస్తుతం కొనసాగుతున్న ‘ఏఐ’ బూమ్‌లో హేతుబద్ధత లేదని అన్నారు. ఒకవేళ ఏఐ విస్ఫోటనం చెందితే దాని ప్రభావం అంతటా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ విస్ఫోటనాన్ని ఎదుర్కొనే స్థితిలో గూగుల్ సంస్థ ఉందా? అని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ, ఆ తుఫాన్‌ను తమ కంపెనీ తట్టుకుటుందని, కానీ ఏదైనా సాధ్యమే అని ఆయన అన్నారు. వాస్తవానికి ఏ కంపెనీ కూడా ఏఐ ప్రభావానికి లోనుకాకుండా ఉండలేదని అన్నారు. ఆ జాబితాలో తమ సంస్థ కూడా ఉందని సుందర్ పిచాయ్ అన్నారు. చాట్‌జీపీటీ, ఓపెన్‌ఏఐతో పోటీ ఉన్న నేపథ్యంలో ఆల్ఫాబెట్‌కు పెట్టుబడులు రెట్టింపు అయినట్లు చెప్పారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం ఐక్యత





**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

హనుమకొండలో మంగళవారం నిర్వహించిన సర్దార్‌ఏ150 ఐక్యత పాదయాత్రను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంభించారు. కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) ప్రాంగణంలో కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ స్నేహ శబరీష్ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి యూనిటీ మార్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్దార్ పటేల్ కృషితోనే దేశం నేటికీ ఐక్యతతో ముందుకు సాగుతోందని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం సంస్థానాల విలీనంలో ఆయన పోషించిన పాత్ర అద్భుతమని, భాషలు వేరు అయినా భారతీయులందరినీ ఒకే తాటిపై చేర్చిన మహనీయుడని పేర్కొన్నారు. అలాగే యువతకు నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించిన ఆమె, డ్రగ్స్ రహిత భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. కేడీసీ గ్రౌండ్‌లో ప్రారంభమైన ఐక్యత పాదయాత్ర పోలీస్ కమిషనరేట్, అంబేద్కర్ సర్కిల్, కాళోజీ కూడలి, ఏకశిలా పార్క్, బాలసముద్రం, హనుమకొండ బస్టాండ్ మార్గాల మీదుగా తిరిగి కేడీసీ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరింటెండెంట్ బానోతు దేవిలాల్, కేఎన్ఆర్‌హెచ్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, కేజీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, కేయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. ఇస్తారి, జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి, డీఎమ్‌హెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ప్రభుత్వం నియమిత సభ్యులు జయంత్ లాల్, సాంద్ర మధు, తీగల భరత్, ఎన్ఎస్ఎస్%-%ఎన్సిసి బెటాలియన్లు, మెప్మా మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. సుమారు 2,000 మంది విద్యార్థులు యూనిటీ మార్చ్‌లో భాగమయ్యారు.

## కాజీపేట రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య

**కాజీపేట, నవంబర్ 18 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



కాజీపేట టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పట్టాలపై మంగళవారం ఉదయం సుమారు ఏడు గంటలకు గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. అందాజు 55-60 సంవత్సరాల వయసు గల ఈ మగవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జి.ఆర్.పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి వ్యక్తిగత వివరాలు తెలియకపోవడంతో, ఎవరికైనా ఆయన గురించి సమాచారం ఉంటే తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వివరాలు తెలిసినవారు జి.ఆర్.పీ కాజీపేట హెడ్ కానిస్టేబుల్ వి. వెంకటయ్యను సంప్రదించవలసిందిగా కోరుతున్నారు. ఫోన్ నంబర్లు - 98491 98382, 99483 48070.

## హిజ్రాల్లో వర్గపోరు



**హైద్రాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ బోరబండలో మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ వర్గానికి చెందిన ఓ హిజ్రా కేసుల పేరిట వేధింపులకు గురిచేస్తోందంటూ కొంతమంది హిజ్రాలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన నిర్వహించారు. ఈ సమయంలో పరిస్థితి వేడెక్కి, ఆవేశానికి లోనైన ఒక హిజ్రా తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో అక్కడ ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది. ఈ ఘటనలో ముగ్గురు హిజ్రాలు, ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. వెంటనే స్పందించిన పోలీసులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఉద్రిక్తత కొనసాగుతుండగా, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించారు.

## నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఆదిలాబాద్,నవంబరు18(జై భీమ్ న్యూస్): రైతులు ఎవరూ అధైర్య పడకండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని రైతులకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ఎల్లావేళలా అండగా ఉంటారని అన్నదాతలకు ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని గుర్తుచేశారు. పండించిన పంట కొనే దిక్కులేక, పట్టించుకొనే నాథుడు లేక సంక్షోభంలో చిక్కుకున్న రైతాంగానికి బాసటగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మద్దతు ధర అందక దగాపడ్డ రైతులకు భరోసా ఇచ్చేందుకు పోరుబాట పట్టేందుకు సన్నద్ధమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రాష్ట్రంలో రైతులు పడుతున్న అష్టకష్టాలను ఎలుగెత్తి చాటాలని నిశ్చయించింది.

## నర్మేట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్

**సిద్దిపేట జిల్లా, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



నంగునూరు మండలం నర్మేటలో నిర్మితమైన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్ ప్రారంభోత్సవ ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ ఏర్పాట్లను తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఆయిల్ ఫెడ్ అధికారులు, మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లతో కలిసి ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్ సామర్థ్యానికి అనుగుణంగా జిల్లాలో ఆయిల్ పామ్ తోటల విస్తరణ తప్పనిసరి అని హెచ్చరించారు. విస్తరణ లక్ష్యాలు చేరుకోకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశముందని స్పష్టం చేశారు. అనంతరం ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు, జిల్లా హార్టికల్చర్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యం, పామాయిల్ సాగుపై ప్రత్యేక దృష్టి, విస్తరణలో అలసత్వం ఉండకూడదని చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు.

**చైర్మన్ ఇచ్చిన ముఖ్య సూచనలు...**

ఫీల్డ్ ఆఫీసర్లు ఉదయం 7 గంటలకు ఫీల్డ్‌లో ఉండాలి, నవంబర్ నుంచి మార్చి వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగించాలి, ఎఫ్ఓలు, పిఎంఓలు ప్రతిరోజూ రైతులను కలిసి పామాయిల్ సాగుకు ప్రోత్సహించాలి, నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు చేశారు. రైతుల్లో పామాయిల్ సాగుపై ఇప్పటికే మంచి ప్రచారం ఉన్నందున, అధికారులు కృషి చేస్తే సులభంగా లక్ష్యాలు చేరవచ్చని చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఓఎస్డీ కిరణ్ కుమార్, మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు, పిఎంఓలు పాల్గొన్నారు.

## హసన్‌పర్తి మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి తృతీయ బెస్ట్ సొసైటీ అవార్డు

**హనుమకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో నిర్వహించిన 72వ అఖిల భారత సహకార వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని 1360 సహకార సొసైటీల నుంచి ఎంపిక చేసిన ఎనిమిది ఉత్తమ సొసైటీలను సత్కరించారు. ఇందులో హసన్‌పర్తి మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి మూడవ బెస్ట్ ఫిషరీస్ సొసైటీగా గుర్తింపు లభించింది. డీసీసీబి బ్యాంకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవార్డును డీసీసీబి బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలిసి బహూకరించారు. సంఘం తరపున అధ్యక్షులు శీలం పృథ్వీరాజ్, వైస్ ప్రెసిడెంట్ పిట్టల జితేందర్, ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ శ్రీనివాస్, డైరెక్టర్లు శీలం బిక్షపతి, శీలం రాజేందర్, గోనెల ఉపేందర్, సంగినేని వీరేశం, వెంగళ రాజు, పెద్దమ్మ సుధాకర్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షులు శీలం సారయ్య, మాజీ డైరెక్టర్ వెంగళ శ్రీనివాస్, ఆర్మీ మాజీ సైనికుడు, ఎల్ఐసి ఏజెంట్ శీలం యాదగిరి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేష్, శీలం దినేష్, పెద్దమ్మ క్రాంతి, శీలం నరేందర్ (ఆర్మీ సైనికుడు) తదితరులు పాల్గొన్నారు. అలాగే ముదిరాజ్ కుటుంబ సభ్యులంతా హాజరై సంఘం సాధించిన విజయాన్ని అభినందించారు. సంఘం పొందిన ఈ అవార్డు వారికి మరింత ఉత్తేజాన్నిచ్చిందని నిర్వాహకులు తెలిపారు.



## కేయూలో గ్రంథాలయ వారోత్సవం 5వ రోజు కార్యక్రమాలు





**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవం ఐదవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. అంతర్జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. మొదటగా ప్రకృతి వైద్యంపై పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయగా, దీనిని కేయూ ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి, కార్యనిర్వాహక మండలి సభ్యురాలు డాక్టర్ బి. రమ ప్రారంభించారు. ప్రకృతి వైద్యానికి సంబంధించిన పుస్తకాలు, రచనలు విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తదుపరి “ప్రకృతి ద్వారా ఆరోగ్యాన్ని తిరిగి కనుగొనండి” అనే శీర్షికతో ఉచిత ప్రకృతి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ప్రకృతి వైద్యురాలు డాక్టర్ ప్రేరణ ప్రకృతి వైద్యం ప్రాముఖ్యతను వివరించగా, అనేక మంది విద్యార్థులు ఆమెను వ్యక్తిగతంగా సంప్రదించి ఆరోగ్య సూచనలు తీసుకున్నారు. అదే రోజు “బిట్వీన్ ది లైన్స్ అండ్ ది లింక్స్: రీడింగ్ ఇన్ ది ఇంటర్నెట్ ఎరా” అనే శీర్షికతో వ్యాస రచన పోటీ నిర్వహించగా, సుమారు యాభై మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. గ్రంథాలయ వారోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమాలకు విద్యార్థులు మంచి స్పందన కనబరిచారని గ్రంథాలయ అధికారులు తెలిపారు.

## టెక్మాల్ ఎస్సైపై ఏసీబీ దాడులు





**టెక్మాల్, నవంబర్ 18 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

టెక్మాల్ పోలీస్ స్టేషన్‌లో భారీ ఉత్కంఠ నెలకొంది. లంచం కేసులో టెక్మాల్ ఎస్సై రాజేష్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఎస్సై రాజేష్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు సమయంలో అధికారులు గమనించని క్షణాన్ని ఆసరాగా చేసుకుని ఎస్సై రాజేష్ స్టేషన్ నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన ఏసీబీ సిబ్బంది అతన్ని టెక్మాల్ శివారులోని వ్యవసాయ పొలాల వరకు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం ఎస్సై రాజేష్‌ను టెక్మాల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ఎస్సై అరెస్టు వార్త గ్రామంలో తెలిసిన వెంటనే ప్రజలు ఆనందంతో టపాకాయలు కాల్చి సంబరాలు జరిపారు. స్థానిక ప్రజలు ఎస్సై అవినీతి, వేధింపుల గురించి పలుమార్లు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఏసీబీ చర్యపై సంతోషం వ్యక్తం చేశారు.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం




**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. హనుమకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేస్తామన్న కాంగ్రెస్ తీర్మానం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వ్యాఖ్యానించారు. కుల గణన పేరిట బీసీల జనాభాను కాంగ్రెస్ కావాలనే తగ్గించి చూపిందని, సర్వే వివరాలు కూడా బయట పెట్టలేదని విమర్శించారు. బీసీలకు న్యాయం చేయడానికి అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకొని పోరాడాలని సూచించినా, కాంగ్రెస్ పట్టించుకోలేదని అన్నారు. పాలనా వారోత్సవాల పేరుతో ప్రజల పీడనోత్సవాలు నిర్వహిస్తున్నారని మధుసూదనాచారి ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని డిమాండ్ చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు అభివృద్ధి పథంలో కొనసాగాలి





**హనుమకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు అభివృద్ధి పథంలో కొనసాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీబి బ్యాంక్‌లోని ఆడిటోరియంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అతిథిగా టీఎస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్ర ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సహకార సంఘాలు, సమాఖ్యలు కలిసికట్టుగా ఉన్నప్పుడే సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వ్యక్తులు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా సహకార రంగంలో ఏర్పాటైన అమూల్ విజయ ప్రస్థానం గురించి కలెక్టర్ ప్రస్తావించారు. పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి అమూల్ అనేది ఎంత పెద్ద బ్రాండ్ అనేది అందరికీ తెలుసని, వర్గీస్ కురియన్ ప్రోత్సాహంతో 250 మంది రైతులతో అమూల్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రారంభించారని పేర్కొన్నారు. ఈరోజు మన దేశం పాల ఉత్పత్తి ఎగుమతిలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. సహకార సొసైటీతోనే ఈ ఘనత లభించిందన్నారు. అమూల్ వార్షిక ఆదాయం సుమారుగా 70 వేల కోట్లకు చేరిందన్నారు. సహకార రంగంలో అమూల్ ప్రముఖంగా నిలిచిందన్నారు. సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు సహకార రంగంతో అగ్రగామిగా నిలిచిన అమూల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా హనుమకొండ జిల్లాలో ముల్కనూర్ సొసైటీ, రాష్ట్రంలో ఉన్న విజయ డైరీ సహకార రంగంలో విజయవంతంగా సాగుతూ స్థిరంగా నిలబడ్డాయని అన్నారు. ఇదే విజయ పరంపరను సొసైటీలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## హసన్‌పర్తి పాఠశాలల్లో స్వచ్ఛత, గుణాత్మక విద్యపై ప్రత్యేక దృష్టి





**హసన్‌పర్తి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని పాఠశాలల్లో స్వచ్ఛత, పరిశుభ్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు గుణాత్మక విద్య సాధనపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ సూచించారు. మంగళవారం హసన్‌పర్తి మండల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాలలో శుభ్రత, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడంలో ప్రధానోపాధ్యాయులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సిలబస్‌ను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంపై ఎలాంటి రాజీ పడకూడదని అన్నారు. ఇటీవల పూర్తయిన సమ్మేటివ్ పరీక్షల ఫలితాలను సమగ్రంగా సమీక్షించినట్టు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతిని అంచనా వేయడానికి ఈ నెల 25 నుండి 30వ తేదీ వరకు అన్ని పాఠశాలల్లో మిడ్‌లైన్ టెస్టులు నిర్వహించేందుకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పుల్ల సంపత్, రమాదేవి, రవీందర్, పీఎం శ్రీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, ఎమ్మార్సీ సిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విదేశీ విద్యా నిధిని పునరుద్ధరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గౌరవనీయులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్. మోహన్ ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి, రాష్ట్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయానికి ధన్యవాదాలు తెలియజేశారు. గత ప్రభుత్వ కాలంలో పూర్తిగా నిలిచిపోయిన అంబేద్కర్ విదేశీ విద్యా నిధి (అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్) కారణంగా దళిత విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలు అంధకారంలోకి వెళ్లిన పరిస్థితుల్లోఈ పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు స్వయంగా ముందడుగు వేసి, ప్రత్యేక ఆసక్తి చూపి నిర్ణయం తీసుకున్నందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు హెచ్.ఆర్. మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, దళితుల సాధికారత అనే మూడు లక్ష్యాల దిశగా తీసుకెళ్తున్న గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధైర్యవంతమైన నాయకత్వం, అలాగే ఉపముఖ్యమంత్రి %డ% ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారి పారదర్శక ఆర్థిక దృక్కోణం ఈ నిర్ణయానికి బలమైందని అన్నారు. దళిత విద్యార్థుల విదేశీ విద్య మార్గం తిరిగి తెరవడం కేవలం ఆర్థిక ప్రోత్సాహం మాత్రమే కాదని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని హెచ్.ఆర్. మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలుసుకొని సన్మానించినట్లు తెలిపారు.

## మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌ను ధృవీకరించిన లడ్డా

రంపచోడవరం,నవంబర్18(జై భీమ్ న్యూస్): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని ఏపీ ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. మంగళవారం ఉదయం 6-7 గంటల మధ్య భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని చెప్పారు. ఎన్‌కౌంటర్ వివరాలను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి ఆయన వెల్లడించారు. గత రెండు రోజులుగా ఇంటెలిజెన్స్ సమాచారంతో గాలింపు చర్యలను విస్తృతంగా చేపట్టామని మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు. మావోయిస్టుల నుంచి వివిధ రకాలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. మరోవైపు కృష్ణా జిల్లాతో పాటు విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఏడీజీ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు. వీరిలో 9 మంది కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నారని వివరించారు. ఎన్÷-కౌంటర్ ప్రాంతంలో మరో ఐదుగురు మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించు కున్నారని చెప్పారు.

## ప్రభుత్వ కళాశాలల్లో నీట్ జేఈఈ ఎంసెట్ కోచింగ్‌కు ఆదేశాలు



**హన్మకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎంసెట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సమగ్ర శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్మీడియట్, సాంఘిక సంక్షేమ, బీసీ, మైనారిటీ మరియు గిరిజన సంక్షేమ శాఖల విద్యా సంస్థల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రస్తుతం నీట్, జేఈఈ, ఎంసెట్ కోసం ఇవ్వబడుతున్న కోచింగ్, విద్యార్థుల ఎంపిక విధానం, నిర్వహిస్తున్న టెస్ట్‌లు వంటి అంశాలపై కలెక్టర్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసముద్రంలో అమలవుతున్న "స్టెమ్%-%60" మాదిరిగా ఇతర ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో కూడా పోటీ పరీక్షల కోచింగ్‌ను విస్తరించాలని సూచించారు. విద్యార్థుల ఎంపిక కోసం మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నీట్, జేఈఈ, ఎంసెట్ తదితర పరీక్షలకు ఉన్నత స్థాయి శిక్షణ అందించి జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించేలా చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ, టిఎస్‌ఆర్జెసి, మైనారిటీ, మోడల్ జూనియర్ కళాశాలల విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్వో వై.వి. గణేష్, డీటీడబ్ల్యూవో ప్రేమకళ, బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, వివిధ గురుకులాల ఆర్సిఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీహార్ ఓటమికి నాదే బాధ్యత - రాహుల్ గాంధీకి నేతల మద్దతు

**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

బీహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఓటమికి నాదే బాధ్యత అని రాహుల్ గాంధీ ప్రకటించిన వెంటనే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయనకు సంఘీభావం తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు రాహుల్ గాంధీ పోరాట స్ఫూర్తిని ప్రశంసిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం ు శత్రువు ఎంత బలమైనవాడైనా ఎదిరించవచ్చు. కానీ శత్రువు మోసగాడై, పోరాటమే లెక్కలోకి రాని పరిస్థితుల్లో గెలుపు ముందే నిర్ణయించబడుతుంది. వ్యవస్థలు, సంస్థలు కలిసికట్టుగా పనిచేసి ఒక నాయకుడిని పదేపదే ఓడించడానికి ప్రయత్నించినా, రాహుల్ గాంధీ మాత్రం ఒక్క అడుగు వెనక్కు వేయరు అని పేర్కొన్నారు. విజయం, ఓటమి రెండింటినీ సమానంగా స్వీకరించే నాయకత్వం అరుదని, పరాజయం వచ్చిన వెంటనే తిరిగి పోరాటానికి సిద్ధమయ్యే నిజమైన యోధుడు రాహుల్ గాంధీ అని వారు అభిప్రాయపడ్డారు. దేశంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజాస్వామిక వ్యవస్థల దుర్వినియోగంపై రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం కొనసాగిస్తారని, ఆయన వెనక్కు తగ్గరని చెప్పారు. ఈ భూమి నీరు వేరైనా, మేము రాహుల్‌తోనే ఉంటాం అని పలువురు నాయకులు ఏకాభిప్రాయంతో తెలిపారు. దేశ రాజకీయాలలో ధైర్యసాహసాల ప్రతీకగా రాహుల్ గాంధీ నిలుస్తున్నారని, ఆయనకు తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.



## మడిపల్లి జెడ్పిహెచ్‌ఎస్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ



**హసన్‌పర్తి, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

యువతలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల ప్రవణతను అరికట్టాలని, విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించాలని లక్ష్యంగా మడిపల్లి జెడ్పిహెచ్‌ఎస్‌లో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉంటామని ఘనంగా ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక, సామాజిక, విద్యా రంగాలపై కలిగే ప్రభావాలను ఉపాధ్యాయులు విశదీకరించారు. మత్తుపదార్థాల వినియోగం ఒక్క వ్యక్తికే కాదు, ఆ కుటుంబానికే కాక సమాజానికే ఒక ముప్పు అని, మొదట చిన్న అలవాటుగా ప్రారంభమైనా అది జీవితాన్ని నాశనం చేసే స్థాయికి వెళ్లే ప్రమాదం ఉందని ఉదాహరణలతో వివరించారు. పాఠశాల పరిసరాల్లో, సమాజంలో ఇలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పెద్దలకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నర్సయ్య మాట్లాడుతూ ు మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థుల అవగాహన, చైతన్యమే కీలకం. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. భవిష్యత్తు పట్ల పట్టుదల, క్రమశిక్షణ, సదాచారం అవసరం. అలవాట్లలో చిన్న తప్పిదం కూడా జీవితాన్ని దారి తప్పించవచ్చు. చదువు, క్రీడలు, సృజనాత్మకత, మంచి స్నేహాలుఇవే యువత భవిష్యత్తును నిర్మించే మార్గాలు అని అన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు మత్తుపదార్థాల బారిన పడే అవకాశాలను ఎలా గుర్తించాలి, వాటి నుంచి ఎలా దూరంగా ఉండాలి, సమయానుకూలమైన సహాయం ఎలా పొందాలి వంటి అంశాలను వివరిస్తూ ప్రేరణ ఇచ్చారు. పాఠశాలలో ప్రతి తరగతిలో, ప్రతి విద్యార్థిలో అవగాహన పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. విజయ్‌పాల్ రెడ్డి, బి. శ్రీదేవి, ఈ. పద్మా రెడ్డి, కే. రవీందర్, ఎన్. మధుసూదన్, ఏ. అనసూయ, బి. విజయరాణితోపాటు విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. పాఠశాల వాతావరణంలో సానుకూలత, క్రమశిక్షణ, మత్తు రహిత వాతావరణం నెలకొల్పేందుకు ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని పాఠశాల ప్రతినిధులు వెల్లడించారు.

## ఎఐసిసి కార్యదర్శిగా ఎంపికైన జెట్టి కుసుమకుమార్‌కు సన్మానం

**హైద్రాబాద్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



నూతనంగా ఎఐసిసి కార్యదర్శిగా నియమితులైన టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మంగళవారం అధికారికంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆయన నివాసంలో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్టీ బలోపేతానికి కుసుమకుమార్ అందించిన సేవలను కొనియాడిన నేతలు, ఆయన కొత్త పదవిలో రాష్ట్రానికి, పార్టీకే మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోకల రాజేందర్ రెడ్డి, వట్టె శ్రీకాంత్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నశా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం






**వరంగల్ జిల్లా, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

నశా ముక్త్ భారత్ అభియాన్ ఐదవ వార్షికోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం వరంగల్ జిల్లా పరిషత్ హైస్కూల్, నరేంద్రనగర్‌లో జిల్లా స్థాయిలో విద్యార్థులచే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేపట్టడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు పట్టుదలగా ముందుకు సాగాలని సూచించారు. తెలియకుండానే చాక్లెట్లు, పానీయాలు, ఇతర రూపాల్లో మత్తు పదార్థాలు యువత జీవితాల్లోకి ప్రవేశిస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించారు. మత్తు వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, చివరికి ప్రాణనష్టం కూడా సంభవించవచ్చని అన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి. రాజమణి మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతూ తమ పిల్లలను చదువుకోడానికి పంపుతున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేందుకు విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని కోరారు. నార్కోటిక్ డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డ్రగ్స్ రకాలు, వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువత డ్రగ్స్ కారణంగా జీవితాలు కోల్పోయిన ఉదాహరణలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నశా ముక్త్ భారత్ అభియాన్‌కు సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ సంధ్యారాణి చేతులమీదుగా ఆవిష్కరించారు. విద్యార్థులకు ప్రత్యేక టీ–షర్టులు, క్యాప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీకాంత్, అదనపు డీఆర్డీఓ రేణుక, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పావని, అనిరుద్, హేమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్, ఉపాధ్యాయ బృందం, సుమారు 850 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తదనంతరం దిల్లీలోని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ఫీ పాయింట్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.

# వృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన కార్యక్రమం

**హనుమకొండ, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**



OFFICE OF THE DISTRICT LEGAL SERVICES AUTHORITY
(District Court buildings) :: At :: Hanumakonda

Dis. No. 1609/DLSA/HNK/2025. Date: 18-11-2025.

From
Sri. G Ramalingam,
Principal Senior Civil Judge-cum-FAC.Secretary,
District Legal Services Authority
Hanumakonda.

To
The Assistant Director,
Information and Public Relation-Department,
Hanumakonda.

Sir/Madam,

Sub: Request to attend all the print and electronic media of Hanumakonda on 19.11.2025 at 9:00 A.M., at Swayamkrushi Old Age Home, Near Mulugu Road, Hanumakonda – Regarding.

-oOo-

It is to state that, as per directions of the Hon'ble Telangana State Legal Services Authority, Hyderabad, the District Legal Services Authority, Hanumakonda is conducting Legal Awareness Programme on **"Maintenance and Welfare of Parents and Senior Citizens Act, 2007"** on 19.11.2025 at 09.00 A.M., at Swayamkrushi Old Age Home, Near Mulugu Road, Hanumakonda.

Hence, I am directed by the Hon'ble Principal District Judge-cum-Chairman, District Legal Services Authority, Hanumakonda to request you to direct to all the Print and Electronic Media of Hanumakonda District to cover the Legal Awareness Programme on on 19.11.2025 at 09.00 A.M., and make it grand success.

Yours faithfully,

Principal Senior Civil Judge-cum-FAC.Secretary,
District Legal Services Authority,
Hanumakonda.

హనుమకొండ జిల్లా న్యాయసేవల అధికారం ఆధ్వర్యంలో మాతాపితలు, వృద్ధుల భరణ%–%పోషణ చట్టం 2007పై అవగాహన కార్యక్రమం నవంబర్ 19వ తేదీ ఉదయం 9 గంటలకు స్వయంకృషి ఓల్డ్ ఏజ్ హోమ్, ములుగు రోడ్ సమీపంలో జరగనుంది. ఈ సందర్భంగా, హనుమకొండ డీఎల్ఎస్ఏ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి %–% కమ్ %–% ఎఫ్‌టీసీ సెక్రటరీ జి. రామలింగం, జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరై పూర్తి స్థాయి కవరేజీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర న్యాయసేవల అధికారం, హైదరాబాద్ సూచనల మేరకు జరుగుతున్న ఈ కార్యక్రమం వృద్ధుల హక్కుల పరిరక్షణ, భరణ%–%పోషణ చట్టం అమలుపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంగా నిర్వహించబడుతోంది. మీడియా సహకారంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ కోరింది.

# హనుమకొండ భద్రకాళి ఆలయంలో భద్రేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన



**వరంగల్, నవంబర్ 18 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి దేవాలయంలో మంగళవారం భద్రేశ్వర స్వామివారికి అత్యంత వైభవంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమానికి తెల్లవారుజామున నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి దివ్య దర్శనం పొందారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు స్వామివారికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో బిల్వదళాలతో లక్షార్చన ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగింది. భజనలు, శైవ పారాయణాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, తాగునీరు, ప్రసాదం, క్యూ లైన్లు, భద్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేశారు. కార్తీక మాసంలో భద్రేశ్వర స్వామికి జరిగే ఈ లక్ష బిల్వార్చన కార్యక్రమం ప్రతి సంవత్సరం వేలాది భక్తులను ఆకర్షిస్తుందని ఆలయ అధికారులు తెలిపారు.

# అదుపుతప్పి ప్రమాదానికి గురైన బస్సు

### 8మంది ప్రయాణజకులకు తీవ్ర గాయాలు

**విజయవాడ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

మరో ట్రావెల్స్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. జాతీయ రహదారిపై లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పిన బస్సు దానిని ఢీకొట్టింది. దీంతో ఎనిమిది మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద జరిగింది. కే. కావేరీ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్నది. ఈ క్రమంలో నందిగామ వద్ద జాతీయ రహదారిపై లారీని ఓవర్ టేక్ చేస్తుండగా బస్సుపై డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో అది లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం ధాటికి బస్సు ఎడమ వైపు నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని దవాఖానకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. కాగా, ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# రాజధాని ఢిల్లీలో మరోమారు బాంబు బెదరింపులు

### పాటియాల కోర్టు తదితర ప్రాంతాల్లో స్క్వాడ్ తనిఖీలు

**న్యూఢిల్లీ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. రాజధానిలోని పలు కోర్టులు, పాఠశాలలే లక్ష్యంగా బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సాకేత్ కోర్టు, పాటియాలా హౌస్ కోర్టు, తీస్ హజారీ కోర్టు సహా ఇతర జిల్లా కోర్టులకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతేకాదు నగరంలోని ద్వారకా, ప్రశాంత్ విహార్ ప్రాంతాల్లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బృందాలుగా విడిపోయి కోర్టులు, పాఠశాలల ప్రాంగణాలకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాలతోపాటూ పాఠశాలలను ఖాళీ చేయించిన అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అంతేకాదు, నగరంలోని అన్ని జిల్లా కోర్టుల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసి భద్రతా తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ బెదిరింపు మెయిల్‌పై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజధానిలో భారీ ఉగ్ర కుట్రకు ప్లాన్ అంటూ వార్తలు వస్తున్న వేళ బాంబు బెదిరింపులు కలకలం రేపాయి.

# ఆత్మాహుతని సమర్థిస్తూ సంచలన వీడియో

### బయటపడ్డ డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో

**న్యూఢిల్లీ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

ఢిల్లీ పేలుడు కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి  చెందిన సంచలన వీడియో బయటకు వచ్చింది. పేలుడుకు ముందు అతడు సూసైడ్ బాంబింగ్ గురించి మాట్లాడాడు. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. 'ఆత్మాహుతి బాంబు దాడికి వ్యతిరేకంగా అనేక వాదనలు ఉన్నాయి. మరణంపై ఉన్న సహజ అంచనాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ప్రదేశంలో కచ్చితంగా చనిపోతాడని భావించడాన్ని బలిదాన ఆపరేషన్ అంటారు' అంటూ ఉమర్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వీడియో సంచలనం రేపుతోంది.

# హిడ్మా ఎన్‌కౌంటర్ వేళ బెజవాడలో కలకలం

### భారీగా నక్సల్స్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు
### 27మంది మావోలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడి

**విజయవాడ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

మావోయిస్టు అగ్రనేత మద్వి హిడ్మా ఎన్‌కౌంటర్ వేళ విజయవాడలో మావోయిస్టుల కలకలం రేగింది. కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. మావోయిస్టులు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టారు. ఈ క్రమంలో విజయవాడ నగరంలో భారీగా 27మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.  . కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో అక్టోపస్, గ్రే హౌండ్స్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 27 మంది మావోలను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై కృష్ణా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మా ఎన్ కౌంటర్ అనంతరం కొత్త ఆటోనగర్‌లో 27 మందిని అదుపులోకి తీసుకున్నామని.. నేడు ఇది చాలా మేజర్ ఆపరేషన్ అని చెప్పుకొచ్చారు. దేవ్ జీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు, అతనితో పాటు ఉన్న తొమ్మిది మంది ప్రొటెక్షన్ టీంను పట్టుకున్నామన్నారు. మిగతా వారు కూడా నక్సల్ ఆపరేషన్‌లో కీలకంగా ఉన్నట్లు చెప్పారు. డీజీపీ పర్యవేక్షణలో ఈ మొత్తం నడిచిందని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం డీజీపీ వెల్లడిస్తారని అన్నారు. వెపన్స్ కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచే వారంతా వివిధ మార్గాల్లో విజయవాడకు వచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో 21 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారన్నారు. రాష్ట్ర పోలీసుకు వచ్చిన సమాచారంతో ఈ ఆపరేషన్ మొత్తం సాగిందని తెలిపారు.హిడ్మా ఇక్కడ నుంచే వెళ్లారనేది ఇంకా స్పష్టత లేదని ఎస్పీ అన్నారు. వారందరినీ పూర్తిగా విచారణ చేశాక వివరాలు తెలుపుతామని.. పోలీసులకు ఉండ్గే ÷ర్ ఫోర్స్‌తో వారు ఎదురు తిరిగలేరన్నారు. ఐదు జిల్లాల్లో నేడు ఈ ఆపరేషన్ జరిగిందని.. కృష్ణా జిల్లా పరంగా తమ ఆపరేషన్ వివరాలు తెలియజేసినట్లు చెప్పారు. డేటా మొత్తం తీసుకుని, విచారణ ముగిశాక అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఇది ఇండస్ట్రియల్ ఏరియా అని.. లేబర్ చాలా మంది ఉంటారని తెలిపారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే వాళ్ల లాగానే మావోయిస్టులు కూడా వచ్చారని.. తమకు సమాచారం వచ్చాక నిఘా పెట్టి నేడు పట్టుకున్నామని వెల్లడించారు. గన్నవరం, పెనమలూరు, కంకిపాడు పోలీసు టీంలు పాల్గొన్నాయన్నారు. మావోయిస్టులు ఏదో ప్రణాళికతోనే ఇక్కడ మకాం వేశారని.. అన్ని విషయాలు విచారణ అయ్యాక చెబుతామని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు.

# దండకారణ్యం నుంచి ఎపిలోకి నక్సల్స్

### పలు జిల్లాల్లో ఆపరేషన్ నిర్వహించిన పోలీసులు
### ఏలూరులో 15మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమచారం

**విజయవాడ,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

మావోయిస్టుల కదలికలతో ఏపీలో హై అలర్ట్ కొనసాగుతోంది. అడవిలో నుంచి ఏపీకి వచ్చిన మావోయిస్టుల కోసం భద్రతాబలగాల గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడలో 27మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని పరిణామాలతో మావోయిస్టులు ఏపీకి రావాలని చూస్తున్నారని మహేశ్ చంద్ర తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలికపై ఇంటెలిజెన్స్ నుంచి రెండు రోజుల క్రితం పక్కా సమాచారం వచ్చిందని చెప్పారు. మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని చూశారని వెల్లడించారు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని మహేశ్ చంద్ర తెలిపారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులుగా గుర్తించామని వెల్లడించారు. మిగిలినవారంతా సౌత్ బస్తర్ జోనల్ కమిటీ సభ్యులు అని పేర్కొన్నారు.

# నిండుగర్భిణి మృతి

### తట్టుకోలేక భర్త ఆత్మహత్య
### శోకసంద్రంలో కుటుంబం

**హైదరాబాద్,నవంబరు18(జై భీమ్ న్యూస్):**

సంతానం కలగాలని ఐవీఎఫ్  చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ అనే యువకుడి గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది. బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్ (40), అతని భార్య శ్రావ్య (35) ఏడాదిన్నర కిందట శంషాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. విజయ్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. సంతానం లేని ఈ దంపతులు ఐవీఎఫ్ చికిత్స తీసుకోవడంతో భార్య గర్భం దాల్చారు. అందులోనూ కవలలు పెరుగుతున్నారని తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. దాదాపు ఎనిమిది నెలల గర్భిణి అయిన శ్రావ్యతో ఆ ఇల్లు సంతోషంతో నిండిపోయింది. కవలల రాక కోసం ఇద్దరూ ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. అయితే, 16వ తేదీ రాత్రి, శ్రావ్యకు అకస్మాత్తుగా కడుపు నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చెప్పిన విషయం ఆ దంపతులకు పిడుగుపాటు లాంటిది. గర్భంలో పెరుగుతున్న కవలలు ఇద్దరూ మృతి చెందారని వైద్యులు ధృవీకరించారు.  ఈ వార్త తెలుసుకుని తట్టుకోలేక శ్రావ్య అక్కడే స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే శ్రావ్య తుదిశ్వాస విడిచింది. ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కొద్ది గంటల వ్యవధిలోనే దూరమవడంతో భర్త ముత్యాల విజయ్ పూర్తిగా కుంగిపోయాడు. తన జీవితాన్ని ముందుకు నడపడానికి ఉద్దేశించిన నాలుగు ప్రాణాలు కళ్లముందే కనుమరుగు కావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ తీరని బాధతో శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతు  మృతితో వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.






# పట్టాలకెక్కనున్న జై హనుమాన్

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది.అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, ÷-రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.

యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు. తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి ముద్దు గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్- రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.






# మహారాణి నయన అడుగు పెట్టింది

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేశారు. మంగళవారం నయన్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ సినిమాలో నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. నయనతారకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ 'సముద్రమంత ప్రశాంతతను, తుపాను అంత బీభత్సాన్ని తనలో మోసే రాణి మా సామ్రాజ్యంలోకి అడుగుపెట్టనుంది' అంటూ వీడియో పంచుకున్నారు త్వరలోనే ఈ చిత్రం నుంచి మరిన్ని అప్‌డేట్స్ వస్తాయని వెల్లడించింది. నవంబర్ 26న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు తెలిపింది.